క్లుప్తంగా

ఏయూ విభాగాల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న కిషోర్ బాబు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు బుధవారం విద్యాలయంలో గల విద్య, తత్వశాస్త్రం, ఇంగ్లిష్, లైబ్రరీ – ఇన్ఫర్మేషన్ సైన్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ, సంస్కృతం, ఆంత్రోపాలజీ తదితర విభాగాలను సందర్శించారు. అక్కడ తరగతులు జరుగుతున్న తీరును నేరుగా పర్యవేక్షించారు. అదేవిధంగా ఆయా విభాగాల్లో నిర్వహిస్తున్న సెమిస్టర్ పరీక్షలను పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు



గాత్ర కచేరీలో కళాకారులు

మద్దిలపాలెం : త్యాగరాజ ఆరాధనోత్సవాలు మద్దిలపాలెం కళాభారతిలో ఆరో రోజు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఏడు రోజుల ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రముఖ గాత్ర విద్వాన్సురాలు మండా సుధారాణి ఆధ్వర్యంలో హంస అకాడమీ గురువులు, శిష్యులు కలిపి 45 మంది 3 గ్రూపులుగా కీర్తనలు ఆలపించారు. అనంతరం ట్రస్ట్ అధ్యక్ష కార్యదర్శులు ఎంఎస్ఎన్‌రాజు, గుమ్మలూరి రాంబాబు మాట్లాడుతూ చక్కటి కార్యక్రమం నిర్వహించిన హంస అకాడమీ వారందరినీ అభినందించారు. 200 మందికిపైగా శిష్యులను తయారు చేస్తున్న ఈ సంస్థ సంగీతానికి చాలా సేవ చేస్తుందని కొనియాడారు. 10 నిమిషాల నిడివి గల కచేరీలు 66, 30 నిమిషాల నిడివి గల కచేరీలు ఆరు నిర్వహించారన్నారు. కచేరీలో మొత్తం 372 మంది కళాకారులు పాల్గొన్నారని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మద్దిలపాలెం : ఈపీడీసీఎల్ జోన్ – 1 పరిధిలో గల వెంకోజీపాలెం, హెచ్‌బీ కాలనీ 11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా ఈ నెల 23న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ హేమతార తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకూ వెంకోజీపాలెం, జె.ఆర్.నగర్, ఉమానగర్, జీవీఎంసీ స్కూల్ ప్రాంతాలు, పశుసంవర్ధక శాఖ కార్యాలయం, ఇసుకతోట, శివాలయం, వీరబాబు గుడి, రెల్లివీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

రేపు కొన్ని ప్రాంతాల్లో..

ఆరిలోవ : 33/11 కేవీ పైనాపిల్‌కాలనీ ఫీడర్ పరిధిలో శుక్రవారం నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. పైనాపిల్‌కాలనీ, సీబీడీ కార్యాలయం, జీఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీ, కామాక్షినగర్, ఎస్ఎస్ఎన్ నగర్, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ఆరిలోవ కాలనీ, ఆఖరి బస్టాప్, కనకమహాలక్ష్మినగర్, దుర్గాబజార్, శివాజీనగర్, రాజీవ్‌నగర్, పాండురంగాపురం, టీబీసీ పాయింట్, శ్రీకాంత్‌నగర్, లక్ష్మీనగర్, ప్రగతినగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యువతి అదృశ్యం

బీచ్‌రోడ్డు : ఉద్యోగానికని ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగి రాలేదని తల్లి వెంకటలక్ష్మి మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఊటగెడ్డలో నివసిస్తున్న షీలా ఉమ ఆశీలమెట్ట సమీపంలో ఉన్న ఓ బంగారం షాపులో సేల్స్ గర్ల్‌గా పనిచేస్తుంది. అక్కడ తనతో కలిసి పనిచేస్తున్న ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఉద్యోగానికి వెళ్లి ఇంటికి రాలేదని... ఆ యువకుడితో వెళ్లిపోయిందని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇదేనా స్వచ్ఛ సంకల్పం?





విరిగిన ఆట పరికరాలు











చెత్త, చెదారంతో అస్తవ్యస్తంగా ఉన్న పార్కు పరిసరాలు

మాటల్లో చెప్పేది చేతల్లో చూపాలి. అప్పుడే ప్రజలు విశ్వసిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలని పదేపదే చెబుతున్నా, ఆచరణలో మాత్రం కానరావడం లేదు. వాటికి నిదర్శనమే ఈ చిత్రాలు. రూ.లక్షలు వెచ్చించి బీచ్‌రోడ్డులో వైఎంసీఏ చేరువలో ఏర్పాటు చేసిన ఆల్ ఎబిలిటీ పార్క్ పరిసరాలివి. ఇక్కడ చిన్నారులు ఆడుకునే పరికరాల్లో అధిక శాతం విరిగిపోయి, శిథిలమై, మూలకు చేరాయి. నిత్యం సాయంత్రం వేళల్లో, వారాంతంలో వందలాది మంది చిన్నారులు ఈ ప్రాంగణంలో ఆడుకునేందుకు వస్తుంటారు. వారికి ఆహ్లాదం పంచే విధంగా ఇక్కడ పరిసరాలేవీ మచ్చుకైనా కానరావడం లేదు. ఆహ్లాదం దేవుడెరుగు, వారికి అనారోగ్యం తెచ్చే విధంగా ఉన్నాయి. పార్కులో వ్యర్థాలను తొలగించే నాథుడు లేడు. పార్క్‌లో నిర్మించిన ఓడ వంటి ఆకారం లోపల నిరుపయోగంగా ఉన్న వస్తువులు, విరిగిన పలు ఆట వస్తువులు, ఇతర వ్యర్థాలను పడేశారు. ఇవన్నీ మట్టికొట్టుకుపోయి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. వీటిని కనీసం శుభ్రం చేయాలనే ఆలోచన కూడా సిబ్బందికి లేకుండా పోయింది. ఇక పార్క్‌లో ఏర్పాటు చేసిన సెక్యూరిటీ రూమ్..ఇక్కడ రోడ్డుపై వ్యాపారాలు చేసుకునే వారు వస్తువులు నిల్వ చేసుకోవడానికి వినియోగించే స్టోర్ రూంగా మారిపోయింది. ఇప్పటికైనా అధికారులు ఈ పార్క్ నిర్వహణపై దృష్టిసారించి, ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది.

– ఏయూక్యాంపస్

ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్

కొత్త పోలీస్ స్టేషన్ రహదారికి శంకుస్థాపన



పోలీస్ స్టేషన్ రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి, సీపీ శంఖబ్రత బాగ్చి

ఆరిలోవ : ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకోసం బుధవారం శంకుస్థాపన చేశారు. ఇటీవల ఆరిలోవ నూతన పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ స్టేషన్‌కు దారి లేకపోవడంతో ప్రస్తుతం విమ్స్ ఆవరణ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు ప్రత్యేకంగా రహదారి నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని గెడ్డపై వంతెన నిర్మాణం చేపట్టి అక్కడి నుంచి స్టేషన్‌కు రహదారి నిర్మించడానికి రూ.60 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో ప్రారంభమైన పనులకు బుధవారం నగర సీపీ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. పనులు తొందరగా జరిపించాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇక్కడ గెడ్డపై 20 అడుగుల వెడల్పు గల బ్రిడ్జి, దాని నుంచి స్టేషన్ వరకు 50 అడుగుల పొడవు గల రోడ్డు నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, ద్వారకా ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు, జీవీఎంసీ డీఈ అప్పారావు, ఏఈ వెంకటరావు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరానికి విశేష స్పందన



పాడి రైతులకు నట్టల నివారణ మందుల ప్యాకెట్లు అందజేస్తున్న పశు వైద్యాధికారులు

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి రామకృష్ణాపురంలో బుధవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆరిలోవ కాలనీ, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, చినగదిలి, దారపాలెం, పైనాపిల్ కాలనీ నుంచి ఆవులు, దూడలు, మేకలు, కోళ్లను సుమారు 200 వరకు ఈ శిబిరానికి రైతులు తీసుకువచ్చారు. విశాఖ జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ రామకృష్ణ పర్యవేక్షణలో డీడీ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, ఏడీ డాక్టర్ శ్రీనివాస్ పాడి రైతులకు పశువుల పెంపకం, పాల ఉత్పత్తి, వాటికి వచ్చే సీజనల్ వ్యాధులు, వ్యాధి నివారణ మందుల వాడకం, పశు బీమా పథకం, పశు కిసాన్ క్రెడిట్ కార్డులు ఉపయోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పశువులకు పేడ పరీక్షలు చేశారు. దూడలు, మేకలకు నట్టల నివారణ మందులు, వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కుక్కలు పెంచే యజమానులకు రేబిస్ వ్యాక్సినేషన్ గురించి వివరించారు. ఇందులో భాగంగా పాడి రైతులకు నట్టల నివారణ మందులు, ఏలిక పాముల నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్యులు హిమజ, అనూష, పలువురు వైద్య సహాయకులు, రామకృష్ణాపురం గ్రామ ప్రెసిడెంట్ వంకర బాబూరావు, పాడిరైతులు పాల్గొన్నారు.

స్టీల్ కార్మికులకు విష్ణుకుమార్ రాజు క్షమాపణ చెప్పాలి

సీపీఎం నాయకుల డిమాండ్

మద్దిలపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా నాలుగేళ్లుగా పోరాడుతున్న స్టీల్ కార్మికులపై, ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తక్షణమే స్టీల్ కార్మికులకు, విశాఖ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. విష్ణుకుమార్ రాజు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ 'కార్మికుల పోరాటంతో ప్యాకేజీ రాలేదు.. ఇది మావల్లే వచ్చింది' అని వ్యాఖ్యానించడమే కాకుండా కార్మికుల ఆశకు అంతుండాలని అనడం దురదృష్టకరమన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ప్రకటించాక కూటమి పెద్దలు కార్మికుల నుంచి, ప్రజల నుంచి సానుకూల వాతావరణం ఆశించారని పేర్కొన్నారు. అయితే ప్యాకేజీని స్వాగతించడంతో పాటు శాశ్వత పరిష్కారం చేయాలని వామపక్ష ట్రేడ్ యూనియన్లు, ప్రజాసంఘాలు, ప్రజలు నిరసనలు తెలపడంతో ఓర్వలేక విష్ణుకుమార్ రాజు కార్మికులు ఇష్టం లేకపోతే రాజీనామా చేసి బయటకు పోండని వ్యాఖ్యలు చేయడం సరైనది కాదన్నారు. విష్ణుకుమార్ రాజు పెట్టుబడిదారీ వర్గానికి నాయకడని మరోసారి రుజువు చేసుకున్నారని విమర్శించారు. ప్రభుత్వరంగాన్ని కాపాడే ప్రజాప్రతినిధిగా ఆయన వ్యాఖ్యలు లేవన్నారు. ప్యాకేజీ వలనే పరిష్కారం కాదని ఇప్పటికైనా అర్థం చేసుకుని స్టీల్‌ప్లాంట్ రక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విశాఖలో బీజేపీకి పుట్టగతులుండవని హెచ్చరించారు.

ఆపన్నులకు అభయహస్తం



కుటుంబ సభ్యులకు మదీనావలిని అప్పగిస్తున్న ఏయూటీడీ సిబ్బంది

సీతమ్మధార: మానసిక వ్యాధితో బాధపడుతున్న మదీనావలిని ఏయూటీడీ సిబ్బంది కుటుంబ సభ్యులకు అప్పగించారు. 1వ పట్టణ పోలీసుల సహకారంతో సెప్టెంబర్ 2023లో ద్వారకానగర్‌లోని టీఎస్సార్ కాంప్లెక్స్‌లో గల జీవీఎంసీ–ఏయూటీడీ వసతి గృహానికి తరలించారు. తను యుక్త వయసులో ఉన్నప్పుడు తల్లి చనిపోవడంతో తండ్రి రెండో పెళ్లి చేసుకుని వదిలి వెళ్లిపోయాడు. దీంతో చెల్లి, తమ్ముడిని చూసుకుంటూ కుటుంబ భారాన్ని మోసేది. పెట్రోల్ బంక్ లో పనిచేస్తూ చెల్లి పెళ్లి చేసింది. సొంత ఇల్లు కూడా కట్టింది. తమ్ముడు మూడు సంవత్సరాలుగా కనిపించకుండా పోవడంతో మొబైల్ ఫోనుకి బానిస అయి మానసిక ఆరోగ్యం దెబ్బతింది. ఏయూటీడీ అందించిన సేవలు, శ్రద్ధా బృందం చికిత్సతో చివరికి వ్యాధి నయం కావడంతో కంచరపాలెం దరి బర్మాకాంపు దగ్గర శ్రీనివాసనగర్‌లో ఉన్న పిన్ని మరియమ్మకి క్షేమంగా అప్పగించారు.

శ్రీకాకుళం వ్యక్తికి ఆశ్రయం..

శ్రీకాకుళంలోని ఆముదాలవలసకు చెందిన అన్నపు ప్రసాద్ (54) కుటుంబ కలహాల వల్ల ఇల్లు వదిలి విశాఖ వచ్చేశాడు. ప్రస్తుతం భిక్షాటన చేసుకుంటూ బతుకుతున్నాడు. ఈ నేపథ్యంలో ఇతను దొండపర్తి ఫుట్‌పాత్‌పై ఉండగా ఏయూటీడీ సిబ్బంది చూసి నిరాశ్రయుల వసతిగృహానికి తరలించారు. ఇతనికి ఏదైనా సెక్యూరిటీ ఏజెన్సీలో గార్డుగా ఉపాధి చూపించే ప్రయత్నం చేస్తున్నట్లు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

ప్రధాని ప్రకటించే వరకూ పోరాటం ఆగదు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగిస్తామని, ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేయాలని, అప్పటి వరకు ఉద్యమాలు, ఆందోళనలు ఆగవని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు వి.శ్రీనివాసరావు, బీఎస్‌రాజు, రమణమూర్తి, డి.వి.రమణారెడ్డి, కారు రమణ అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో మంగళవారం చేపట్టిన 1441వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. 2021 జనవరి నాటికి రూ.28వేల కోట్ల టర్నోవర్, రూ.940 కోట్ల నికర లాభంతో నడుస్తున్న విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వ విధ్వంసకరమైన కుట్రలు, కుతంత్రాలతో 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నడిచే శక్తి ఉన్న విశాఖ ఉక్కును 1.5 మిలియన్ టన్నుల ఉత్పత్తికి దిగజార్చిందని ఆరోపించారు. ప్రభుత్వాల తీరు కత్తితో పొడిచి ఆయింట్‌మెంట్ పూసినట్టు ఉందని, ఈ ప్యాకేజీ కూడా ఇదే కోవకు చెందుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరు మార్చుకొనేలా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఒప్పించాలని, ఆ బాధ్యత తీసుకుంటామని, ఎన్నికల ముందు వాగ్దానాలు చేశారని, విస్మరిస్తే ప్రజలు క్షమించబోరన్నారు. దాసరి శ్రీనివాసరావు, రాపాటి కోటేశ్వరరావు, సీహెచ్.సన్యాసిరావు, పోతయ్యరెడ్డి, నగేష్, సత్యారావు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ షెల్టర్ పరిశీలన



రెడ్‌క్రాస్ షెల్టర్‌ను పరిశీలిస్తున్న రూపా మిశ్రా

బీచ్‌రోడ్డు : పెదవాల్తేరు దళాయివారి వీధిలో జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హోమ్‌లెస్ షెల్టర్‌ను బుధవారం పలువురు అధికారులు సందర్శించారు. ఎన్‌యూఎల్ఎం (నేషనల్ అర్బన్ లైవ్ మిషన్) జాయింట్ సెక్రటరీ రూపా మిశ్రాతోపాటు అదే విభాగానికి చెందిన మౌగోల్మామ్, యూసీడీ పీడీ సత్యవేణి, ఏపీడీ రాము, జోనల్ కార్యాలయ సిబ్బంది షెల్టర్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. ఆశ్రయం పొందుతున్న వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. షెల్టర్ నిర్వాహకుడు మురళిని అభినందించారు.

జీవీఎంసీ 22వ వార్డు పరిధి శివాజీపాలెంలోని స్లమ్ సమాఖ్యలతో ముఖాముఖి కార్యక్రమాన్ని రూపా మిశ్రా నిర్వహించారు. సమాఖ్య సభ్యుల పనితీరు, సభ్యుల వ్యాపార, ఆర్థిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీడీ రాము, సీవో సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల పార్కింగ్‌తో ఇబ్బంది కలిగిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ప్రసాద్

సీతమ్మధార : రోడ్డు పక్కన ట్రావెల్ బస్సుల పార్కింగ్‌తో ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దని ద్వారకా సబ్ డివిజన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.ఎస్.ఎన్.వి.ప్రసాద్ కోరారు. రామాటాకీస్ సమీపంలోని విశాఖ కంటి ఆస్పత్రి సమీపంలో గల ప్రైవేట్ ట్రావెల్ బస్సుల నిర్వాహకులతో బుధవారం రేసపువానిపాలెంలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్యం జంక్షన్ నుంచి రామాటాకీస్‌కు వెళ్లే ప్రధాన రహదారికి రెండు వైపులా ప్రైవేట్ బస్సులు ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం వల్ల పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ట్రాఫిక్‌కి ఆటంకం లేకుండా మాత్రమే బస్సులు పార్కింగ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. ఆటోడ్రైవర్లు ఎక్కువ ఛార్జీలు వసూలు చేసినా నేరుగా పోలీస్ కమిషనర్‌కి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ద్వారకా సబ్ డివిజన్ ఎస్ఐ ప్రతాప్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన త్యాగరాజ కీర్తనలు



త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

మురళీనగర్ : మురళీనగర్ రామాలయంలో సర్వేజనా సుఖినోభవంతు బృందం బుధవారం ఆలపించిన త్యాగరాజ కీర్తనలు భక్తులను అలరించాయి. సంస్థ బృందం నిర్వహించే త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా 178వ త్యాగరాజ కీర్తనల ఆలాపనా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మహిళలు కోలాటం ప్రదర్శించారు. అనంతరం త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, ఎస్.వరప్రసాద్, పి.శ్రీనివాసరావు, జీవీ ఆనందరావు, ఎస్ఎంకే మోహన్, విజయలక్ష్మి పాల్గొని కార్యక్రమం నిర్వహణకు సహకరించారు. సర్వేజనా సుఖినోభవంతు ప్రతినిధి సత్యమాధవి పాల్గొన్నారు.

ఘర్షణలో యువకుడికి తీవ్ర గాయాలు

ఎంవీపీ కాలనీ : ఓ యువతి విషయమై మద్దిలపాలెంలో ముగ్గురు యువకుల మధ్య జరిగిన ఘర్షణలో వినోద్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిలపాలెంలోని ఓ పార్లర్‌లో ఓ యువతి (20)ని ఆమె బావ వెంకటరమణ కొంతకాలం క్రితం జాయిన్ చేశాడు. అనంతరం ఆ యువతికి ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న వినోద్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. వారి మధ్య సాన్నిహిత్యం పెరగడంతో గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే వెంకట్ అనే మరో యువకుడు తనని ప్రేమించాలంటూ యువతిపై ఒత్తిడి చేస్తున్నాడు. దానికి ఆ యువతి నిరాకరించడంతో ఇటీవల ఆ యువతి బావ వెంకటరమణకు ఫోన్ చేసి... నీ మరదలు వినోద్ అనే యువకుడితో తిరుగుతోందని చెప్పాడు. వెంటనే వెంకటరమణ తన మరదలకు ఫోన్ చేసి మందలించాడు. దీంతో కోపానికి గురైన ఆ యువతి ప్రియుడు వినోద్‌తో పాటు స్నేహితురాలిని, మరో యువకుడిని తీసుకుని మద్దిలపాలెంలోని రామాలయం వీధి దరి వెంకట్ ఇంటికి మంగళవారం రాత్రి వెళ్లి బయటకు పిలిచారు. వెంకట్ బయటకు వచ్చిన తర్వాత రామాలయం సమీపంలో వాదనకు దిగారు. వెంకట్‌పై దాడి చేసేందుకు వారంతా ప్రయత్నించగా తనతోపాటు తెచ్చుకున్న ఇనుప ఊసతో వినోద్‌పై వెంకట్ ఎదురు దాడి చేసి గాయపరిచాడు. తీవ్ర గాయాలైన వినోద్‌ను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం వినోద్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని, వెంకట్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సర్వీస్ ప్రొవైడర్స్ మేళాకి 119 దరఖాస్తులు



సర్వీస్ ప్రొవైడర్స్ వివరాలు పరిశీలిస్తున్న జోన్ - 3 యూసీడీ సిబ్బంది

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ – 3 కార్యాలయం పరిధిలో చేపట్టిన సర్వీస్ ప్రొవైడర్స్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని యూసీడీ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రాము కోరారు. ఈ మేరకు జోన్ – 3 యూసీడీ విభాగం ఆధ్వర్యంలో ఆశీలమెట్టలోని జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో సర్వీస్ ప్రొవైడర్ల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెప్మా సంస్థ, హోమ్ ట్రయాంగిల్ సంయుక్త ఆధ్వర్యంలో సర్వీస్ ప్రొవైడర్లను ఇ – కామర్స్ ప్లాట్‌ఫారమ్ మీదకి ఆన్‌బోర్డు చేయడానికి మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. శిక్షణ అనంతరం హోమ్ ట్రయాంగిల్ సంస్థ యాప్ ద్వారా ఆన్‌బోర్డ్ చేస్తారని తెలిపారు. మొదటి దశలో వడ్రంగులు, ప్లంబింగ్, విద్యుత్ సేవలు, విద్యుత్ ఉపకరణాలు, బ్యూటీషియన్లకు అవకాశమిస్తున్నామని తెలిపారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎలక్ట్రీషియన్ల నుంచి 35, ఏసీ మెకానిక్‌ల నుంచి 15, ప్లంబర్ల నుంచి 31, బ్యూటీషియన్ల నుంచి 28, బార్బర్ నుంచి ఒకటి, వాటర్ ప్యూరిఫైయర్ నుంచి రెండు, టీవీ మెకానిక్‌ల నుంచి రెండు, కార్పెంటర్ల నుంచి ఐదు కలిపి మొత్తం 119 దరఖాస్తులు జోనల్ కార్యాలయంలో స్వీకరించామని తెలిపారు. కార్యక్రమంలో జోన్ – 3 యూసీడీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలను అన్ని రంగాల్లో ఎదగనిద్దాం

ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం

సీతమ్మధార : బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించి ఎదగనిస్తేనే జాతీయ బాలికా దినోత్సవానికి అర్థముంటుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఐసీడీఎస్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సీడీపీవో) ఎం.వి.రమణ కుమారి, ఏసీడీపీవో శ్రీలత ఆధ్వర్యంలో మహారాణిపేట మండల స్థాయి మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, స్కూల్ నోడల్ టీచర్లు, విద్యా కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బందికి రేసపువానిపాలెం సామాజిక భవనంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌమార దశ పిల్లల ఆరోగ్యం, అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరించారు. ఇంకా బాల్య వివాహాలు జరుగుతూనే ఉండడం విచారకరమన్నారు. వీటి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని కోరారు. సీడీపీవో ఎం.వి.రమణ కుమారి మాట్లాడుతూ కౌమార దశ అనేది చాలా క్లిష్టమైందన్నారు. మెడికల్ ఆఫీసర్ మన్మోహన్, అప్ హోల్డ్ ఎన్జీవో జిల్లా కో ఆర్డినేటర్ డేవిడ్ రాజ్ పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలలో చేపట్టాల్సిన చర్యలు, వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిటైర్డు చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణవేణి, ఒన్ స్టాప్ సెంటర్ ఇన్‌చార్జి శరణ్య, తదితరులు పాల్గొన్నారు.